

-శ్రీదాస్యం లక్ష్మయ్య
అడ్మిన్, నేటికవిత
9440155240

# నేటికవిత-కవిత్వ విశ్లేషణ

నేటికవితలో ఈ వారం: 'సుక్కల ముగ్గు'
అనే అంశంపై వచ్చిన 58 కవితల సమీక్షలో అత్యుత్తమంగా నిలిచిన



-దాస్యం సేనాధిపతి
కవిత్వ విశ్లేషకులు
9440525544

## ముత్యాల ముగ్గు

వేకువ పుష్పోదయానికి ముందే
చందమామ చెంబుతో కల్లాపి చల్లి
ఇంటిచుక్కై అరవిరిసిన కమలాలకళ్ళతో.

నీలాకాశపు పందిరి నుండి రిక్కల
ముత్యాలు తెంపివేసి చుక్కలముగ్గు
సోయగం వర్ణించతరమా!.

సాలెగూటి అల్లికను మించి
ఎన్ని గీతల ముగ్గులేసినా
చుక్కేసిన చుక్క ముగ్గుతో సరితూగునా?

రిక్కల ముత్యాల ముగ్గులో
ఇంద్ర ధనువు సప్తరంగుల
పొడుల సమ్మిశ్రితమై.

తమలపాకు ఈనెల కోమల కోమలి
వేలికొసల వేళ్ళజాలువారె
ఆ చుక్కల ముగ్గు సోయగాలు
తిలకించ దిగిరారా అప్సరాంగణలు దివినుండి.
ముత్యాల చుక్కల
ముగ్గులేని ఇంటి ముందరి
ఆవరణ అమావాస్య చెందురుడే!.

చుక్కల ముగ్గేయాలంటే ఆషామాషి కాదు
ఆకసాన చుక్కలు లెక్కెట్టినంత సహనం
సముద్రాన్ని ఈదినంత
సాహసం ఉన్న అతివలకే సాధ్యం



-భాస్కర బాలభారతి
9491353544

అనంతపురంకు చెందిన సీనియర్ కవయిత్రి శ్రీమతి భాస్కర బాలభారతి గారు సుక్కల ముగ్గు అంశంపై ముత్యాలముగ్గు శీర్షికతో రాసిన కవితలో సుక్కలముగ్గు వేయడం ఆషామాషీ కాదనీ..ఆకాశాన చుక్కలు లెక్కపెట్టినంత సహనం సముద్రాన్ని ఈదినంత సాహసం అవసరమనీ.. ఈ రెండూ అతివలకే సాధ్యమని తేల్చి చెప్పారు. వేకువ పుష్పోదయానికి ముందే చందమామ చెంబుతో కల్లాపి చల్లి అరవిరిసిన కమలాల కళ్లతో అంటూ కవితను కవితాత్మకంగా ఎత్తుకున్నారు. నీలాకాశపు పందిరినుండి రిక్కల ముత్యాలు తెంపి వేసే చుక్కల ముగ్గు సోయగం వర్ణింపతరమా అంటూ చుక్కల ముగ్గు రమణీయతను అక్షరాలలో ఆవిష్కరించారు. సాలెగూటి అల్లికను మించి ఎన్ని గీతల ముగ్గులేసినా చుక్కేసిన చుక్కముగ్గుతో సరితూగదని తెలియజేసిన తీరు బాగుంది.

ఇంద్రధనుస్సులోని ఏడురంగులు ప్రతిబింబించేలా రిక్కల ముత్యాల ముగ్గును ప్రస్తావించారు. సప్త వర్ణాల పొడులతో ముంగిట కొలువుదీరే ముగ్గు ఏకంగా హరివిల్లును తలపిస్తునందన్న భావం స్ఫురించేలా కవయిత్రి గారు తమ కవితను కొనసాగించారు. ముగ్గులు వేసే కోమలాంగుల వేలికొసలను తమలపాకు ఈనెలతో పోల్చారు. కోమలమైన కోమలి వేళ్లనుండి జాలువారే చుక్కల ముగ్గుల సొయగాలు చూడముచ్చటగా ఉంటాయని వాటిని వీక్షించ దివినుండి అప్సరాంగనలు దిగిరారా అంటూ అతివలు రంగవల్లులు వేసే ప్రతిభను ప్రశంసాపూర్వకంగా ప్రస్తావించారు.

ఇంటి ప్రాంగణంలోని ముంగిట శోభను కలిగించేది చుక్కలముగ్గేనని అభిప్రాయపడ్డారు. కోట్ల విలువైన నగలు పట్టువస్త్రాలకన్నా పెళ్లికూతురుకు నిండు అందాన్నిచ్చేది ఆమె బుగ్గన పెట్టే దిష్టి చుక్కే సంపూర్ణ అందాలు తెచ్చిపెడుతుందని తెలియజెప్పారు. ఇంటిముందర ఆవరణ ప్రకాశించాలంటే ముత్యాల చుక్కలముగ్గే అత్యంత ఆవశ్యకమని ముగ్గులేని ఇంటి ప్రాంగణం అమావాస్య చంద్రుని తలపిస్తుందని పేర్కొన్నారు. అయితే చుక్కల ముగ్గు వేయడం అతివలకే సాధ్యమని అది అంతా ఆషామాషా వ్యవహారం కాదని తెలిపారు. సహనం..సాహసం.. రెండూ అవసరమని నొక్కి చెప్పారు. ఎంతో ఓర్పు, నేర్పు ఉంటే తప్ప చుక్కల ముగ్గులు ముంగిట హరివిల్లులై వెలుగులు పంచేవని వివరించారు. కవయిత్రి భాస్కర బాలభారతి గారు ఇంటికి కళను శోభను పెంచే చుక్కల ముగ్గును ఆద్యంతం చక్కని పదబంధాలతో ఆవిష్కరించడం ప్రశంసనీయం.

## సుక్కల ముగ్గుసందిట ముత్యాలు

ఉషాకాంత స్వాగతపు అందాలలో
సుక్కల ముగ్గు సందిట ముత్యాలు
అవనికొలనులో తామరపువ్వుల సొగసున
పల్లెసీమ లోగిళ్ల ముంగిట
కళ్లాపు నీళ్ళ నాట్యంలో
అతిదవల చేతులనుండి జాలువారే
సుక్కల ముత్యాలు.
ఆ కళాఖండాలు యేశిల్పి చాతుర్యమో
ఆ పడతుల ఎదలో మెలిగే ఆకృతులు
అపురూపంగా రూపుదిద్దుకుంటూ
అందరి మనసుల, మమతలూ
దోచుకునే సుక్కల ముగ్గులు.
పండగ దినాలల్లో .. పెళ్లి వేడుకల్లో
ముగ్గుల పోటీలలో
రాయంచ సొగసుల రంగుల కలయికలో
పరుగులు తీసే చుక్కల తీరు
ధనుర్మాసపు సందడిలో
గుడిగంటల రవళి.
ఎడ్ల మెడలో
చిరుమువ్వల సవ్వడులలో
సంక్రాంతిలక్ష్మి ఆహ్వానంలో
వినీలాకాశంలో చుక్కలతో
పోటీపడు సుక్కల ముగ్గుల
సొబగులు వర్ణించ తరమా!.



-రేవిణిపాటి రమాదేవి
9182540028

హైదరాబాదుకు చెందిన సీనియర్ కవయిత్రి రేవిణిపాటి రమాదేవి గారు భ్రమర కలంపేరుతో తమ రచనలు చేస్తారు. సుక్కల ముగ్గు అంశంపై చుక్కల ముగ్గు సందిట ముత్యాలు శీర్షికతో తమ కవితను రాసారు. ముంగిట ఎంచక్కా ఆడపడుచులు వేసే చుక్కల ముగ్గులు ఆకాశంలోని నక్షత్రాలను తలపిస్తాయన్న భావన స్ఫురించేలా కవయిత్రి తమ భావాలకు అక్షరాకృతినిచ్చారు.

కవిత ఎత్తుగడలోనే ఉషోదయ సమయాన భానుని కిరణాలతో జతకట్టి స్వాగతం పలికే రంగవల్లుల సోయగాలను కవయిత్రి వివరించ యత్నించారు. ఉషాకాంత స్వాగతపు అందాలలో సుక్కలముగ్గు సందిట ముత్యాలుగా ప్రకాశిస్తాయని పేర్కొనడం బాగుంది.

అవనికొలనులో తామర పువ్వుల సొగసున పల్లెసీమ లోగిళ్లలో కల్లాపు నీళ్ల నాట్యంలో అంటూ కొనసాగించిన పంక్తులు కవితలో చక్కగా ఒదిగిపోయాయి. అతివల వేళ్లనుండి జాలువారే చుక్కల ముత్యాలు ముగ్గులై అందరినీ మురిపిస్తాయన్న అర్థం వచ్చే విధంగా కవయిత్రి గారు తమ భావాలను ప్రకటించారు. అవనికొలనులో తామర పువ్వుల సొగసు అంటూ కవితకు పుష్టిని కూర్చారు. ఆడపడుచుల మనోఫలకంపై నర్తించే ఆకృతులు, అపురూపంగా రంగవల్లులుగా మారిఅందరినీ ఇట్టే ఆకట్టుకుంటాయని తెలిపారు. అందరి మనసులనే కాదు మమతలను దోచుకునేలా చుక్కలముగ్గులు ముంగిట కొలువుదీరేలా అతివలు తమ కళానైపుణ్యంతో అందరినీ మెప్పిస్తారని తెలిపారు.

వివిధ సందర్భాలలో పండుగల దినాలలో.. పెళ్ళి వేడుకలలో.. ముగ్గుల పోటీలలో వేసే ముగ్గులు రాయంచ సొగసుల రంగుల కలయికతో పరుగులు తీస్తాయని చెప్పడం బాగుంది. ధనుర్మాసపు సందడిలో సుప్రభాత వేళ ముంగిట తీర్చి దిద్దే రంగవల్లులు ఆడపడుచుల ప్రతిభకు పట్టం కడతాయనీ.. గుడిగంటల రవళి ఎడ్ల మెడలో చిరు మువ్వల సవ్వడులతో సంక్రాంతి లక్ష్మికి సాదర స్వాగతం పలికేదీ..చుక్కల ముగ్గులేనని తేల్చిచెప్పారు.

ఆకాశంలోని చుక్కలతో పోటీపడుతూ చుక్కల ముగ్గులు పంచే సొబగులు సోయగాలు అక్షరాలలో వర్ణించతరమా! అంటూ మంచి ముగింపునిచ్చారు. కవయిత్రి ఆర్. రమాదేవి గారు చుక్కల ముగ్గు యొక్క గొప్పదనాన్ని తమదైన శైలిలో వ్యక్తీకరించారు. పద బంధ ప్రయోగంలో తమ నేర్పరితనాన్ని ప్రదర్శించారు. మున్ముందు మరింత కవిత్వాంశతో కవిత్వం అందిస్తారని విశ్వసిద్దాం.

## బంగారు పువ్వులు

ఆకాశపు తోటలో
రాత్రిపూసిన నక్షత్రాలు
తెల్లారేసరికి లోగిళ్లలో
జలజలా రాలిపడ్డాయి!.
రాలిన చుక్కలకు
సుద్దకుంచెతో జీవిగంజి
విచ్చుకున్న పువ్వుల్లానో
ఎగురుతున్న పిట్టల్లానో!.
సమైక్యతకు సూచికలా
సమపాళ్లలో పరుచుకున్న మొగ్గలు
విశ్వానికి గుర్తుగా వలయాకారంలా
కళాత్మక రాశులకు పూసిన శంఖంలా
తీరొక్క రీతిలో ముగ్గుల కొలువులు!
తీరేదైనా అందమైన అల్లికలు
ఉషోదయాన పలకరించే సుప్రభాతాలు
మనసుకు ఉత్తేజమిచ్చే చల్లని నవ్వులు
చెట్టు మీద వాలిన గువ్వలు.
రాత్రయ్యేసరికి
అన్నీ కలిసి రథం ముగ్గెక్కి
ఆకాశపు తోటలో విరగబూస్తాయి
మేలిమి బంగారు పువ్వుల్లా!!



-గంగాపురం శ్రీనివాస్
9676305949

సిద్దిపేటకు చెందిన కవి గంగాపురం శ్రీనివాస్ గారు సుక్కల ముగ్గు అంశంపై బంగారు పువ్వులు శీర్షికతో తమ కవితను తతీర్చి దిద్దారు. ఉషోదయాన తీరొక్క అల్లికలతో చుక్కల ముగ్గు ముంగిట ముస్తాబై అందరినీ అలరించే విధంగా ఆహ్వానం పలుకుతాయన్న అర్థం ధ్వనించేలా కవి శ్రీనివాస్ గారు తమ కవితను రాసారు. అంశం వెలుగులో శీర్షిక పెట్టి చుక్కల ముగ్గులను బంగారుపువ్వులుగా ఆవిష్కరించి పాఠకులను మెప్పించ యత్నించారు. చక్కని భావుకతకు చోటు కల్పిస్తూ కవి కవితకు జీవం పోశారు. ఆకాశపు తోటలో రాత్రి పూసిన నక్షత్రాలు తెల్లారేసరికి లోగిళ్లలో జలజల రాలిపడ్డాయంటూ ప్రారంభంలోనే నక్షత్రాలను చుక్కల ముగ్గులో చూసిన అనుభూతిని అక్షరాలలో నిక్షిప్తం చేశారు. రాలిన చుక్కలకు సుద కుంచెతో విచ్చుకున్న పుష్పాలుగా ఎగురుతున్న పక్షులుగా తీర్చిదిద్దడంలో అతివల నేర్పరితనం కానవస్తుందన్న అర్థం వచ్చేలా కవి తమ భావుకతను ప్రదర్శించి కవితకు పుష్టిని కలిగించారు. లెక్కప్రకారం చుక్కలు పెడితేనే ముగ్గు ముగ్ధమనోహరంగా రూపుదిద్దుకుంటుంది. సమైక్యతకు సూచికలా సమపాళ్లలో పరుచుకున్న మొగ్గలు విశ్వానికి గుర్తుగా వలయాకారంలా కళాత్మక రాశులకు పూసిన శంఖంలా తీరొక్క రీతిలో ముగ్గుల కొలువులు అంటూ చుక్కల ముగ్గు యొక్క అందాలను విభిన్న కోణాలలో అభివర్ణించేందుకు కవి ప్రయత్నించారు. వివిధ రూపాలలో ఇంటిముంగిట వేయబడే ముగ్గులు తీరేదైనా అందమైన అల్లికలై అందరినీ అలరిస్తాయని ఉషోదయాన పలకరించే సుప్రభాతాలై భాసిల్లుతాయని పేర్కొన్నారు. అంతేగాక ముగ్గులు మనసుకు ఉత్తేజపరచే చల్లని నవ్వులవుతాయని చెట్టుమీదవాలిన గువ్వలను తలపిస్తాయని చెప్పడం బాగుంది. కవి శ్రీనివాస్‌గారు అంశాన్ని ఆద్యంతం కవితామయం చేయడానికి చక్కని అభివ్యక్తితో పాటు శిల్పం విషయంలో ఔచిత్యవంతమైన పదబంధ ప్రయోగం చేశారు. చుక్కలముగ్గు ప్రాశస్త్యాన్ని చక్కని వర్ణనలతో తెలియజెప్పారు. ముగింపులోనూ కవి శ్రీనివాస్ గారు తమ సృజనాత్మక ప్రతిభను ప్రదర్శించారు. ఆకాశపు తోటలో రాత్రి పూసిన నక్షత్రాలు తెల్లారేసరికి లోగిళ్లలో రంగ వల్లులై మురిపించి తిరిగి రాత్రయ్యేసరికి అన్నీ కలిసి రథంముగ్గెక్కి మేలిమి బంగారుపూవులా వెలుగొందేందుకు ఆకాశపు తోటకు పయనమవుతాయన్న భావం వచ్చేవిధంగా చెప్పడం బాగుంది. మున్ముందు మరింత గాఢమైన కవిత్వం ఆయన పండించాలని కోరుకుందాం.

## యోగా మొగ్గలు

ధ్యానంలోని నిశ్శబ్దమే నివురుగప్పిన నిప్పై
నిరాశానిస్పృహలను కాల్చి వేసే కాగడా
ఆలోచనలను అదుపుజేసే ఆనకట్ట ధ్యానం.

పనివత్తిడి అలలపై సాగే శరీరమనే పడవను
మనశ్శాంతి గట్టుకు చేర్చే సాధనం ఆసనం
ఎముకల నౌకను నడిపే ఇంధనం యోగాసనం.

గుడిసెలోని పేదోనికైనా ఉచితంగా రోగాన్ని తరిమి
ఆరోగ్యానిచ్చే అసలైన అక్షయపాత్ర యోగవిద్య
ఉన్నోనికి లేనోనికి ఆరోగ్యబంధువు యోగాసనం.

వాయువును బిగవట్టి ఆయువును పెంచుకొని
ఆరోగ్యభారతావనిని ఆవిష్కరించేది ధ్యానం
శ్వాసమీద ధ్యాస అదే ఆయువును పెంచే భరోసా



-శశాంక్ బర్కు
9553182850

## తొలకరి పలకరింపు

మబ్బుల్లో నీళ్ళు చూసి
పొలం ఎద తలుపులు తెరిచింది
బట్ట తడుపు వర్షానికే
మట్టి పరిమళాన్ని పంచింది!.

ఎవరో మంత్రం వేసినట్లు
బయట మంత్ర ముగ్ధ సౌందర్యం
తాపాన్ని త్యజించిన సమీరం
పశ్చత్తాపంతో వింజామరలు వీస్తున్నది!

నాగేటి సాలులో నలిగిన పాదం
వర్షం నీటితో తడిసి పరమ పవిత్రం
మొక్కాల్సిన పని లేదు కాని
సరం పడ్డప్పుడు తలిస్తే ఋణం తీర్తది!

తడిసిన మట్టెప్పటికీ
తరగని ఖజాననే
మనం ఒళ్ళొంచి తవ్వాలి కాని
బతుకు పద్యాలు మొలకెత్తేది అక్కడే!

పదును వాన కురిస్తే చాలు
నాగలి రైతు భుజమెక్కి ఊరేగుతది
ఏరువాక రోజున అంతఃకరుణ సాక్షిగా
కృషీవలుడు దేశానికి అన్నాన్ని వాగ్దానం చేస్తాడు!

అతనూ నేనూ అంతే
తొలకరి వానకు మునిగినా తేలినా
ఏడాది పొడుగునా
సే(ప)ద్యాన్ని కలగనడం మానలేం!!



– కోట్ల వెంకటేశ్వర రెడ్డి
9440233261.



## జ్ఞాపకాల అంచున మా ఊరు

నాకు అంతా జ్ఞాపకమే
మా వీధికి వీధి దీపాలు లేనప్పుడు
మా వాకిట్లో వెన్నెలుండేవి
ఆ వెన్నెల్లో ఆడుకునే
మా ఆడపిల్లల నీడలుండేవి
మరునాటి ఉదయం
మా పెరట్లోని గోరింటాకుతో
ఎర్రగా పండే వాళ్ళ అరచేతి సిగ్గులుండేవి
నాకు అంతా జ్ఞాపకమే
అప్పుడప్పుడు ఊరి చివరి కాలవ గట్టుకి
మరోసారి పొలంగట్ల నుంచి
తోటల్లోని వనభోజనాల
కొమ్మలక్రిందకి గుంపుగా వెళ్ళి
గంపెడు తియ్యని జ్ఞాపకాల మాధుర్యాన్ని
గుండెల్లోకి దోచుకునేవాళ్ళం
నాకు అంతా జ్ఞాపకమే
రెప్పలు మోసే స్వప్నాలను
పక్క మీద నుంచి ఏరుకొని
ఇరుకులేని హృదయాలతో
విశాలమైన ముగ్గులను దాటుకుంటూ
వేపపుల్ల నములుతూ
కోడిపుంజులను సంకనెత్తుకొని
సంక్రాంతి భోగిమంటల దగ్గర
పొగమంచు ముసక చీకట్లను
పాదాల వెనకకునెట్టేవాళ్ళం.
నాకు అంతా జ్ఞాపకమే
నాగుల చవితికి ఊరు చివర పుట్ట దగ్గరికి
పట్టు చీరలు కట్టుకొని
పాలముంతలు పట్టుకొని
ఊరు ఊరంతా
పెళ్లికూతురై మురిసిపోయినట్టుండేది
నాకు అంతా జ్ఞాపకమే
వసంతాన్ని ఇంటింటికి తెచ్చే కోయిలమ్మలు
వాన చినుకులలో
వల్లప్ప జతలో చిందులేసే చిన్నతనాలు
ఉభయ కుసులోపరిలో రచ్చబండదగ్గర
ఇంటింటి కథల సుట్టపొగలు ఊదుకునే
పెద్దతనాలు
అన్నీ నాకు జ్ఞాపకమే
నాకు అంతా జ్ఞాపకమే
ఒకరి కన్నీళ్ళను ఒకరు
ఒకరి ఆనందాన్ని ఒకరు పంచుకుంటూ
మా పల్లెటూరి అమాయకత్వాన్ని
మా గుడిసిఖరాన తళుక్కుమనే
మొదటి కిరణాలలో చూసుకొని
మా ఊరు పచ్చగా నవ్వేది
నాకు అంతా జ్ఞాపకమే
నిజంగానే ఇప్పుడదంతా
చారిత్రక సాక్ష్యంగా మిగిలిపోయిన
ఒక కమ్మని జ్ఞాపకమే అని నాకూ జ్ఞాపకమే.

– సుప్రం గణేష్‌బాబు.

## నాన్న మనసు

గుప్పెడంత ప్రేమపంచి మురిపించును నాన్న మనసు
అంతులేని అనురాగం కురిపించును నాన్న మనసు.

బతుకునావ నడిపించ ఒడిదొడుకులు తట్టుకుంటు
బిడ్డలకై అహర్నిషలు తపియించును నాన్న మనసు

తనబిడ్డల కడుపునింపి కడుపుతీపి నీళ్ళుతాగి
కన్నకలలు తీరగానె తరియించును నాన్న మనసు.

తననువీడి ఎగిరిపోవు ఎదిగినబిడ్డలనుచూసి
కళ్ళలోన ప్రేమదివ్వె వెలిగించును నాన్న మనసు

అనుభవాలె పాఠాలుగ రంగరించి బోధచేసి
వకుళవాసు బతుకుబాట నడిపించును నాన్న మనసు



-వకుళ వాసు,
9989198334

## ఎలా తీర్చుకోగలం

ఆకసం నుండి చినుకు రాలితే
ఆ కన్నులలో ఓ మెరుపు..

నిండిన చెరువు కళను చూసిన
ఆ గుండె సడిలో ఆనందాల దరువు..

పైరులకు పచ్చదనం అందించే
యాగంలో ఆతని బతుకంతా
వెతలమయం...

పంటకు సిరులనుకూర్చి
జనుల ఆకలి తీర్చే
అన్నదాత జీవితమంతా
అంతులేని పోరాటం...

పచ్చని చెట్టులా ఆతనిది
ఫలాపేక్ష లేని జీవితం..
అమ్మ చేయిలా రైతుది

అన్నం అందించే చల్లని గుణం...
నిద్రాహారాలు లెక్క చేయని
అన్నదాత సైనికుడిలా
మడమ తిప్పని యోధుడు...

ఎరువుల కరువు,కోరల కరువు
రుణాల బరువు ఎంత సతాయించినా
చెదరని ధైర్యంతో ఈ అవని పై
బతుకును పండించడానికి
ఆతడు చేసే త్యాగం దైవానికీ
అసాధ్యం...
ఆ కర్షక దేవుడి రుణం ఎలా తీర్చుకోగలం...



-వెల్మల జయపాల్ రెడ్డి
9441168976

పుస్తక సమీక్ష

# పివి ప్రతిభాసంపత్తిని ఆవిష్కరించిన "అసాధ్యుడు"

ప్రసిద్ధ రాజనీతిజ్ఞుడు, అపరచాణక్యుడు, బహుభాషావేత్త, సంస్కరణశీలి, అనువాదకుడు, ఆధునిక భారతదేశానికి దిక్సూచి పి.వి.నరసింహారావు. వారి శతజయంతిని పురస్కరించుకొని వారి స్మృత్యర్థం స్మరించుకుంటూ వెలువడిన కవితాసంపుటి అసాధ్యుడు (పివి మొగ్గలు).

నూతన వచనకవితా ప్రక్రియయైన మొగ్గలు ప్రక్రియలో వెలువడిన కవితాసంపుటి ఇది. పివి రాజకీయ జీవితాన్ని, సాహిత్య వైభవాన్ని, సంస్కరణల నేపథ్యాన్ని వేనోళ్ళ కీర్తించిన పుస్తకమిది. ఇందులోని మొత్తం 125 మొగ్గలు పివి జీవితాన్ని పరిమళింపజేసిన మందారమకరందాలు. ఏ మొగ్గ చదివినా పివి ఉన్నతమైన వ్యక్తిత్వం, ఉదాత్తమైన జీవన విధానం, ఉత్తమమైన రాజకీయ సోపానం మన కళ్ళముందు సాక్షాత్కరింపజేస్తుంది.

చిన్నవయసులోనే హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెసు పార్టీలో చేరి నిజాం ప్రభుత్వ నిషేధాన్ని ధిక్కరిస్తూ వందేమాతరం గేయాన్ని పాడిన ధైర్యవంతుడు పివి. అటు స్వాతంత్ర్యోద్యమంలోనూ, ఇటు హైదరాబాదు విముక్తి పోరాటంలోనూ పాల్గొన్న పివి బూర్గుల రామకృష్ణారావు శిష్యుడిగా కాంగ్రెసు పార్టీలో చేరి అప్పటి యువ కాంగ్రెసు నాయకులు మర్రి చెన్నారెడ్డి, శంకరరావు చవాన్, వీరేంద్ర పాటిల్ లతో కలిసి పనిచేసిన దిట్ట. 1951లోనే అఖిల భారత కాంగ్రెసు కమిటీలో సభ్యుడిగా స్థానం పొందిన ఘనాపాఠి. నరసింహారావు తన రాజకీయ జీవితాన్ని జర్నలిస్టుగా ప్రారంభించి, కాకతీయ పత్రిక నడిపి అందులో జయ అనే మారుపేరుతో వ్యాసాలు రాసేవాడు. పివి పదిహేడు భాషలను నేర్చుకున్న బహుభాషావేత్త.

భారతదేశ ప్రధానమంత్రి పదవిని అధిష్టించిన మొదటి దాక్షిణాత్యుడు, ఒకేఒక్క తెలుగువాడు పివి. భారత ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మకమైన సంస్కరణలకు బీజంవేసి, కుంటుతున్న వ్యవస్థను తిరిగి పట్టాలెక్కించిన ఘనతను సొంతం చేసుకున్న అసాధారణ వ్యక్తి. 1957 లో శాసనసభ్యుడిగా రాజకీయజీవితం ఆరంభించిన పివి రాష్ట్రమంత్రిగా, ముఖ్యమంత్రిగానే కాకుండా కేంద్ర







రాజకీయాలలో కూడా ప్రవేశించి ప్రధానమంత్రి పదవిని చేపట్టిన అసాధ్యుడు. కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో తగిన సంఖ్యాబలంలేని మైనారిటీ ప్రభుత్వాన్ని పూర్తికాలం పాటు నడిపి చాణక్యనీతిని ప్రదర్శించిన ఘనుడు.

విశ్వనాథ సత్యనారాయణ వ్రాసిన "వేయిపడగలు"కు "సహస్రఫణ్" పేరిట హిందీ అనువాదం చేసిన సృజనశీలి. ఈ పుస్తకానికే పీవీకి కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి రావడం విశేషం. "పన్ లక్షత్ కోన్ ఘతో" అనే మరాఠీ పుస్తకాన్ని "అబల జీవితం" పేరిట తెలుగు అనువాదం చేశాడు. పివి "లోపలి మనిషి" ని ఆవిష్కరించిన ఆత్మకథాత్మక నవల"ఇన్ సైడర్". ఇందులోని ఘట్టాలన్నీ పివి ముఖ్యమంత్రి పదవి నుంచి దిగిపోయేంతవరకూ సాగిన సంఘటనలు ఆవిష్కరిస్తాయి. తెలంగాణా సాయుధ పోరాట నేపథ్యంలో "గొల్ల రామవ్వ" కథ జయ కలంపేరుతో కాకతీయ పత్రికలో 1949లో ప్రచురించాడు.

ఇవేగాక మరెన్నో వ్యాసాలు వివిధ కలంపేర్లతో వ్రాసాడు.

అటువంటి మహోన్నత వ్యక్తికి భీంపల్లి శ్రీకాంత్ ఇచ్చే గౌరవమే ఈ పివి మొగ్గలు. పివిని అన్ని కోణాలలో ఆవిష్కరించిన అక్షర మొగ్గలు ఈ పివి మొగ్గలు. ఇందులో మొత్తం 125 మొగ్గలున్నాయి. ఒక్కొక్క మొగ్గ ఒక్కొక్క విశిష్టతను తెలియపరుస్తూ పరిమళాలను వెదజల్లుతున్నాయి.

**"జీవితంలో తొలి ఉద్యమ ప్రస్థానానికి శ్రీకారం చుట్టి**
**వందేమాతర ఉద్యమంతో వేకువకిరణమై వెలిగిందు**
**పివి పోరాటానికి పునాది వేసింది వందేమాతరోద్యమం"**

పివి వివిధ పోరాటాలలో, ఉద్యమాలలో పాల్గొన్న తీరును ఈ మొగ్గలో చక్కగా ఆవిష్కరించాడు భీంపల్లి. పివి రాజకీయ అరంగేట్రానికి ఈ ఉద్యమం బలం చేకూర్చిందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

"దేశంలో నూతన ఆర్థిక సంస్కరణలనే చెట్లను నాటి
భవిష్యత్తుకు సరళీకరణ ఫలాలను అందించిన ఘనుడు
భారతదేశ నూతన ఆర్థిక విధానాల రూపశిల్పి పివి"

భారతదేశ ఆర్థిక వ్యవస్థను బలపరిచడానికి నూతన సంస్కరణలు చేపట్టిన ఆర్థిక రూపశిల్పి పివి అని ఈ మొగ్గలో తెలపగా,

"విశ్వనాథ సత్యనారాయణ "వేయిపడగలు" నవలను
హిందీలోకి "సహస్రఫణ్" గా అనువదించిన పండితుడు
అపురూపమైన అనుసృజనకు అసలైన భాష్యం పివి"

అని పివి మంచి అనువాద రచయిత అని, సాహితీవేత్తయని, బహుభాషా కోవిదుడని, అనేక గ్రంథాలను అనువాదం చేసిన సృజనకారుడని శ్లాఘిస్తాడు.

"నాయకత్వపటిమతో రాజనీతిజ్ఞతతో విధేయుడిగా నిలిచి
ఇందిరాగాంధీ అంతరంగికులలో ఒకటిగా నిలిచిన మేధావి
రాజకీయాల్లో నమ్మకంతో మెలిగినందుకే ప్రధానయిన పివి"

రాజకీయంలో నమ్మకంగా మెలిగితే ఎవరైనా ఉన్నతమైన స్థానంలో ఉంటారనడానికి పివి ఒక ప్రబల నిదర్శనం. అలా మెలిగినందుకే పివి అందరి మెప్పుపొంది ప్రధాని అయిన దక్షిణ భారతదేశ తొలి వ్యక్తి పివి.

**"తెలుగు భాషను బోధనా మాధ్యమంగా ప్రవేశపెడుతూ**
**తెలుగు అకాడమిని స్థాపించిన తెలుగు భాషా ప్రేమికుడు**
**తెలుగు భాషకు పట్టాభిషేకం చేసిన తెలంగాణ దిట్ట"**

పివి తెలంగాణవాడు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తెలుగు భాషా కోసం చేసిన సేవను ఈ మొగ్గలో తెలిపాడు భీంపల్లి.

**"భారతదేశం తలెత్తుకునేలా ప్రధాని పదవిని చేపట్టి**
**దేశం దశదిశను నలుదిశలకూ చాటిన సంస్కరణ శీవి**
**భారతదేశ జెండాను విశ్వంలో ఎగురవేసిన ఘనుడు పివి"**

ఈ మొగ్గలో భారతఖ్యాతిని ప్రపంచమంతటా వ్యాపింపచేసిన ప్రధాని పివి అని స్మరిస్తాడు.

ఇలా ప్రతి మొగ్గలో పివి అసాధారణ ప్రతిభా సంపదను, అసామాన్యమైన పాండితీప్రకర్షను ఆవిష్కరించిన భీంపల్లి శ్రీకాంత్ ఒక్కొక్క మొగ్గ ఒక్కొక్క భావవ్యక్తీకరణ చేస్తూ ఆద్యంతం పాఠకుడిని రంజింపజేసేలా రచించడం విశేషం.



-డా.మంగళగిరి శ్రీనివాసులు,
9491388662

## నాన్న

నాన్నంటెమిసిమి వెన్నెల
నాన్నంటెబతుకు ప్రవంతి నాన్నపలుకులే
వెన్నపు ముద్దలు సుద్దులు
నాన్నతొలిగురువు హితుడును నాన్నకు దండాల్

– రేడియమ్
సెల్: 9291527757



## ఆర్టీసీ డ్రైవరు

బస్సెక్కిన మొదలు
దిగేవరకు దిగులే
పట్టీలు పోయిన బండి
ఎగిరెగిరి పడుద్ది
ఎగిరినోడల్లా
తిట్టని తిట్టు తిడుతరు
మెల్లగ పోతే
మెల్లగ పోతుందంటరు
లగాంచి పోదామంటే
స్పీడులాకులుంటయ్.

ఆపిన చోట
ఆగమంటరుదిగే కాడ
దింపమంటరు
ఆపకున్నా తిడుతరు
దింపకున్నా తిడుతరు
రెప్ప మూస్తె చాలు
రోడ్డు దిగేట్టు రోడ్లు
బండి పంపుచారైతే
ఒళ్లంతా హూనమాయె.

పొద్దెక్కి బండెక్కుతే
డిప్పరేయని బండ్లు దూసుకొత్తుంటయ్
తాగినోడోతీరు, తాగనోడోతీరు
ఇల్లు చేరేదాకా ఏంటో తెలియదాయె.

కొత్త బండ్లంటే
బడ్జెటు లేదంటారు
జీతాలు పెంచమంటే
కుక్కకు బొక్కేసినట్టుజేత్తరు
చాలీ చాలని బతుకులు
బతుకు చాలని బతుకులు
నీ ప్రయాణమెటు ఆర్టీసీ డ్రైవరూ.

– గుర్రం విజయ మహేశ్వర్ రెడ్డి
సెల్: 9848923954

## నాన్న చెప్పిన మాట

నీచిన్నప్పటి అడుగులు
తప్పటడుగుగా ఉండకూడదని
నాజీవితంలోని ఎదురుదెబ్బలు
బావించా నీకుతగలకూడదని.

పాలకై ఏడ్చినప్పుడు
నాఆకలి నిద్దురలా
నీజీవితం ఎప్పుడు
ఉండకూడదు ఉచ్చులా.

నేచేసే కూలీపని
నాబిడ్డలు చేయకూడదనీ
చెప్పించా చదువలని
సంస్కారంతో మెలగాలనీ

నాస్నేహితులతో నేచులకనైనట్టు
మీస్నేహితులతో హేళనవకూడదని
మీచిరునవ్వు ఉండేటట్టు
ఇచ్చా ఎన్నోబహుమతులను.

మీఏడుపుకు ఏడిచాను
నీళ్ళొచ్చాయని నాబిడ్డకంట్లో
కొట్టినప్పుడు మిమ్మలను
నీళ్ళొచ్చాయి నాకంట్లో

సిగరెట్/మందు వ్యసనం
తిట్టా దూరంగుండాలని
మీకుండాలి మంచితనం
తిట్టానందుకే గమనించాలని

డబ్బులేని రోజుల్లో
నేవున్న పస్తులు
ఊహించను నాఊహల్లో
పడుకోటం మీరేపస్తులు

నేనేసా చిరిగినచొక్కా
నాకనురెప్పలైన మీకు
తొడిగించా జీన్స్‌చొక్కా
హీరొలాగుండాలి ఇతరులకు
ప్రేమించానని చెప్పినప్పుడు

కోపమొచ్చింది చాలా
ప్రతినిర్ణయం నాదైనప్పుడు
ప్రేమదూరంచేసే సునామిలా

గుడిసేలోని చిరిగినచొక్కాగాన్ని
బాధపడకూడదు నాబిడ్డలు
రెక్కలకష్టంతో కట్టామిద్దె
కష్టంతెలియకూడదని బిడ్డలు

నాముఖంపై కోపం
మనసులో ప్రేమ
రాసేటి బలపం
అవ్వాలని నాలోభ్రమ.

మొక్కలోనే విరిగనే
నాయొక్క జీవితం
మానులా ఎదగాలని
నీడవాలని మీజీవితం,

సాయంచేస్తిరి కష్టంలో
మహానుభావులు ఎందరో
కర్ణుడిలా సాయంలో
కష్టమెస్తే తలచాలెందరో.

నేతిట్టిన కొట్టిన
మీపైకాదు కోపం
బాధపడతా మనసున
నాకెందుకని ఈ కోపం

నేఎలా పెరిగన
ఎదురేరావాలి మీనడవడికి
పరుగులతో మీలక్ష్యమైన
అర్థముండాలి మీమాటకి



-మల్లె రంజిత్ కుమార్
7032650908









ఈనెల 24న (శనివారం) హైదరాబాద్ అలకాపురి శంకరమఠంలో తెలంగాణ ప్రభుత్వ భాషాసాంస్కృతిక శాఖ సహకారంతో శ్రీ చోడేశ్వర నాట్య కళామండలి సమర్పించిన 'శ్రీకృష్ణరాయబారం' నాటక ప్రదర్శనానంతరం ముఖ్యఅతిథిగా విచ్చేసిన సాహితీకిరణం మాసపత్రిక సంపాదకులు పొత్తూరి సుబ్బారావు, శ్రీకృష్ణుని పాత్రదారుని సత్కరించి ప్రసంగించిన దృశ్యం. చిత్రంలో మల్లాది రమణ, ఎ.ఆర్.శర్మ తదితరులు.

# బోనాల జన జాతరలు



ఆశాఢంల హైద్రాబాద్ గల్లీల్ల..
ఆకాశమంత బోనాల సంబురాలు
సందుగొందుల్లో దావత్‌ల జాతరలు
ఇరుకైన ఇండ్లళ్ల చుట్టాల సందడులు
గుండెల నిండా గంపెడంత ప్రేమలు
ఉట్టి రోజులల్ల ఉత్తన్నం తిన్నా..
అష్టకష్టాలతో సంసారాలు చేసినా..
అమ్మోరికి బోనమిచ్చినాక..
బగారన్నం నీసు కూర తినుడే !

గోల్కొండ జగదాంబ ఉత్సవాలు
ఉజ్జయినీ అమ్మవారి వేడుకలు
బాల్కంపేట ఎల్లమ్మనే?
కాళీమాతగా ఆరాధనలు
మహంకాళీ ఆలయంల..
ఆన్‌లైన్ బోనాల ఆరాధనలు
పచ్చికుండ మీద మాతంగి
భవిష్యవాణి చిలుక పలుకులు !

అమ్మోరి తల్లికి తమ్ముడైన..
పోతరాజు ఆటల చిందులు
ఈరకోలతో దెబ్బలు తినేటోళ్లు
అమ్మకు తొట్టెల సమర్పించేటోళ్లు
ట్రాన్స్‌జెండర్ శివసత్తుల..
నెత్తిన ఎత్తిన సప్తవర్ణ బోనాలు
డప్పు చప్పుళ్ల దరువుల మోతలు !

గ్రామీణ భోజన బోన ప్రసాదాల్ని..
గ్రామదేవతలకే భక్తితో నివేదనలు
ఏడుగురమ్మలకు బంగారు బోనాలు
చీరసారెలు, గాజుల గలగలలు
పట్టువస్త్రాల చదివింపుల పూజలు
ఉగ్రరూప చండికా అమ్మోరికి..
రక్త తర్పణంతో శాంతులు
అక్కన్న మాదన్న ఘటాన్ని..

ఏనుగు అంబారీపై ఊరేగింపులు
నయాపూల్‌ల్లో ఘట నిమజ్జనాలు !

మహమ్మారిని మట్టు పెట్టమని..
కర్షకుడిపై ధాన్యవర్షం కురిపించమని..
పనిపాటలు పక్కాగా దొరకాలని..
పళ్లెంల పరమాన్నం నిండాలని..
ఇంటింటా అక్షయపాత్రలు వెలవాలని..
రోగాలు రొష్టులు పొలిమేరలు దాటాలని..
ముఖాల నిండా నవ్వులు వికసించాలని..
బోనమెత్తి అమ్మోరికి బోర్లపడి వినతులు !



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# డబ్బు

ఆహారం కావాలన్నా
ఆధారం నేనే-
వలువ పొందాలన్నా
విలువ నేనే-
నివాసం కుదరాలన్నా
సాధనం నేనే-

## నేను నేనే

విత్తాన్ని నేను
అసలు మీ జీవితాన్నే నేను
కల సాకారం కావాలన్నా
బలం చేకూరాలన్నా
అభివృద్ధి పొందాలన్నా
అందలం ఎక్కాలన్నా -నేనే



– డా॥ చిట్యాల రవీందర్
సెల్: 7798891795

# చినుకు

చిటికేస్తూ పిలిచింది చినుకు
తనువు తడిపేస్తూ సరదా
పడింది చూడు
మేటికలు విరుస్తూ
పరుగులు పెట్టింది చూడు
ఆనందానికి హద్దులు లేవంటూ
వంపులు తిరుగుతూ
హ్వాయలు పోతుంది చూడు
జర జర మంటూ
బిర బిరా పరుగులు
పెడుతూ స్వేచ్ఛా విహంగంల
సాగిపోతుంది చూడు
మాట వినని యవ్వనంల
అల్లరి నేర్చిన కన్నెపిల్లల
ఆటల పాటలన్ని వెంటేసుకుని
సాగుతుంది చూడు
నేలమ్మను తడిపింది
మొలకలె తెచ్చింది చూడు



-పి.విశాలాక్షి...
9908435805..

# కరోనా శకం

కరోనా తో మారిన కథలెన్నో
శిధిలమైన బడుగు జీవుల వ్యథలెన్నో
ఉపాధి లేక
బ్రతకలేని అల్పమైన ప్రాణులెన్నో
జీవన గతినే కోల్పోయిన గరీబు జీవితాలెన్నో
దీనంగా
హీనంగా
దిక్కుతోచని
నిర్భాగ్యుల ఆకలి వేదన లెన్నో
జీవనం సాగించ లేక
ఉపాధిని వెతకలేక
భవిష్యత్ పై ఆశపడే అనాధ జీవుల ఆశలెన్నో....
ఆవేదన లెన్నో
ఆలోచనలు లెన్నో
భారతావని గుండెల్లో
ఆరని చితి మంటలెన్నో
చులకనగా చూసే చూపు లెన్నో
వేరుగా చేసే బంధుత్వాలెన్నో
బాధని పంచుకోలేని
ఒంటరి జీవితాన్ని వెక్కిరించే
కాలం చేసిన గాయలెన్నో
కరోనా తో కాలిపోయిన
జీవిత పుటలెన్నో...
రాయలేని
చదువ లేని
చరిత పుటలో
చెరగని అక్షరాల శకమై
మిగిలే కరోనా కాలం....



-శ్రీపాల్
8978894808

# కళ

కళ
ఒక చినుకై నీ మనసుచిప్పలో పడి
యెప్పుడు స్వాతిముత్యమైందో నీకే తెలియదు,
కళ
ఒక నదియై నీ హృదయకేదారాన్ని
యెపుడు తడి చేసిందో నీవు ఎరుగవు,
కళ
ఒక నెమలై నీలో ఏ నవాషాఢ వేళ
పురివిప్పిందో నీవు గ్రహించలేవు,
కళ
ఒక తుషారమై
నీ ఆలోచనల్లో హిమాన్ని పలికించిన సందర్భం
ఎపుడో తెలియదు.. మరి,
కళ ,
నిన్ను
ఆవహించినపుడు
ఆక్రమించినపుడు
ఆశ్రయించినపుడు
ఆలపించినపుడు
కళను ఎటు ప్రవహింపజేస్తున్నావు?
ప్రజాజీవనప్రాభవం లో నీ కళాపాత్ర ఎంత?

కళ మనిషి ఐతేనే అర్థం
మనిషి కళ ఐతేనే పరమార్థం!



– డా.కాసర్ల నరేశ్ రావు
9441406252

# కాకెంగిలి . . .

ఏ పండైనా ఒంటిగా తింటే రుచి ఎక్కడిది
కాకి ఎంగిలి చేసి గుంపుగా తింటే
కాయైనా పండులా మధురం మధురం !
బాల్యంలోని మిత్రులంతా
ధనికా పేదా లేకుండా
కాకెంగిలికి ఫిదా ఐనోల్లే !

తోటంతా ఎన్నెన్ని జామ కాయలో
ఐన దోస్తులూ సరికి సరి అందరే మరి

ఇప్పుడు ఏ కాయ తిన్నా నేస్తాలు యాదికొచ్చి
కాకెంగిలి దశాబ్దాల కలుపుగొలుపుతనంగా
మరపు లేని శాసనం !

ఊర్లల్లా నీటి పారకం అన్ని కాల్వల్లా
జీవ నదులైనాకా
పండ్ల తోటలకు తక్కువ లేదు !
తోటల పిల్లల జాతరకు ఒక రోజని లేదు !
తాతల కాలం నుండి వారసత్వంగా
ఇగ దోస్తాన కాకెంగిలిగా తోట తోటంత !
కాకెంగిలి ఐనాక కచ్చ కాయైనా
తియ్యగా చిల్క కొరికిన పండే



– కందాళై రాఘవాచార్య
8790593638

# అఖండ దీపం

ఇవాళ
బ్రహ్మ విద్యలేమున్నయ్
కాస్తంత కృషీ పట్టుదలల్ని
గాలానికి ఎరల్లా గుచ్చేసి
కాలం నదిలో వేస్తే చాలు
ఎగిరి దూకిన చేప పిల్లల్లా
మన బతుకు బుట్టల్లోకి జారిపడతాయి

ఏ విద్యా ఎవడి సొత్తూ కాదు
లాకర్లో దాచిపెట్టుకుని కులికేందుకు
అది పూల పరిమళం
ఇనప్పెట్టెల్లో దాచి పెట్టినా
దాని గుబాళింపు నిన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది

కొన్ని విద్యల్ని గుప్పెట్లో పెట్టుకుని
మాకే సొంతమంటూ విర్రవీగిన
చీకటి చరిత్రలకిక కాలం చెల్లింది.

ఇవాళ విద్య
నేర్చుకున్న వాడికి నేర్చుకున్నంత
అతనెప్పుడో గొలుసుల్ని తెంపేసి
వ్యత్యాసాల సరిహద్దుల్ని చెరిపేసి
జా&జన నేత్రాన్ని దేహ దేహానికీ అంటించి
పుస్తకాల్లోకి తొంగిచూడమని
హక్కుల పత్రం రాసిచ్చిండు.

అక్షరం ఎవడి గుత్తాధిపత్యమూ కాదని
శాసనం తయారు చేసి
ఒకానొక వెలి ప్రపంచపు చేతిలో
కాంతి కాగడాలా పెట్టిండు.

ఇక ఏదీ బ్రహ్మ విద్య కాదు
సామాన్యుడి విద్యే
ఇవాళ దేశాన్ని వెలిగిస్తున్న
అఖండ దీపం



- చిత్తలూరి
8247432521

# చైతన్య భాస్కరుడు శ్రీశ్రీ

మహోజ్జ్వల చైతన్య మూర్తి శ్రీ శ్రీ
అక్షరాక్షర వజ్రాయుధం శ్రీశ్రీ
తాడిత పీడిత బడుగు వర్గాల
జీవితాల్లో వెన్నెల వెలుగు శ్రీశ్రీ
దగాకోరు గుండెల్లో ఫిరంగి గుండు శ్రీ శ్రీ
కర్షక శ్రామిక కార్మిక వర్గాలకు కాంతిరేఖ శ్రీ శ్రీ
చాందసుల బూర్జువా భావాల
దుమ్ముదులిపిన సింహం శ్రీ శ్రీ
అభ్యుదయ భావాలకు మార్గదర్శి
చదివింది జంతుశాస్త్ర మైన
అభ్యుదయ విప్లవాలకు శాస్త్రి
విశాఖ లో పుట్టిన విజ్ఞానపు గని
విప్లవ జ్యోతులు వెలిగించిన వేగుచుక్క
మహాకవి గా వెలిగిన మహోజ్జ్వల కీర్తి
శ్రీ శ్రీ కావాలి నేటి యువతకు స్ఫూర్తి
అక్షర అస్త్రశస్త్రాలను సంధించిన
మనో విప్లవ జ్వాల శ్రీ శ్రీ
భావితరాల వారికి శ్రీ శ్రీ
సాహిత్యం అజరామరం
( మహాకవి శ్రీ శ్రీ
వర్ధంతి సందర్భంగా )



- రస ప్రవంతి -9290215858
కావ్యసుధ - 9247313488

# రమ్మంటున్నదందుకనే !

నువ్వు బయటకు రావు
నీ ప్రతిభనీ బయటకు రానీవు
ఎవరు ఏమంటారోనన్న భయంతోనో
ఎక్కడ తోట్రుపాటు పడతానన్న ఆందోళనతోనో
నీకు నువ్వుగా సంకెళ్లు వేసుకుంటావు.

నీకు తెలియకుండానే
నీ బాల్యం గడిచిపోయింది
నీకు తెలుస్తూనే
యవ్వనమూ కరిగిపోతుంది
ఏమైనా చేద్దామని నిర్ణయించుకునేలోపే
ముసలితనపు దుప్పటి
నిన్ను సాంతం కప్పేస్తుంది
అయినా నువ్వు అలాగే ఉంటావు
కదలని రాయిలా
వదలని రేయిలా.

బాల్యపు జ్ఞాపకాల పడవలోనే
జీవితాంతం ప్రయాణించాలని
నువ్వెప్పుడూ తలపోస్తావు
నీ ఉడుకు రక్తం తెచ్చిపెట్టిన బహుమతులను
తదేకంగా చూసి
అవి నీ జీవితకాల ప్రతిభకు నిదర్శనాలని
అవే ఒలింపిక్ సాక్ష్యాలనీ
నోబెల్ సాదృశ్యాలనీ
నీకు నువ్వుగా మురిసిపోతావు
మోడుబారిన నీ ప్రతిభావృక్షానికి
పచ్చరంగును పులిమి
అదే వసంతమని భ్రమపడతావు.

కాలం కల్పించిన అవకాశపు జల్లులతో
కలల పంటలను సాగుచేయకుండా
వీరులు కలిగించిన స్ఫూర్తితో
విజయ పతాకాన్నెగరేయకుండా
నీ ఊహ జగత్తులోనే ఊయలలూగుతూ
నిజంచేసుకోని తీయని స్వప్నాలవెంట
వడివడిగా పరుగులు తీస్తావు
వేళ్ళ సందుల్లోంచి ఇసుక జారిపోయినట్టు
కాలం నీ చేతినుండి జారిపోతుంది
అప్పుడు నీ కన్నీళ్లు కాలువలై
ఉప్పునీటి సముద్రాలను తయారు చేస్తాయి
కావ్యమై వెలగాల్సిన నీ చరిత్ర
కన్నీటితో ముగుస్తుంది
అందుకనే నేస్తమా !
నిన్నిప్పుడు బయటకు రమ్మంటున్నది



– ఎన్. నరేశ్ చారి
9701334516

# నమ్మకం (కథ)

శార్వాణికి జ్వరంగా ఉండడంవల్ల తన ఆడపడుచు మాధవిని పనిలోకిపంపించింది . అయిష్టంగానే వెళ్ళినా తిరిగివచ్చేటప్పుడు చేతిలో ఏదో కవర్ పట్టుకొచ్చింది .అటూ ఇటూ చూస్తూ తనను ఎవరూ చూడడం లేదని నిర్ధారించుకుని పెట్టెలో దాచింది.

అది శార్వాణి గమనించింది. మరదలు పడుకున్నాక పెట్టె తెరిచిచూస్తే కొత్తచీర 1000 రూపాయలు ఉంటుంది.

ఏదో ఆలోచించి ఊరుకుంది.

×××××

శార్వాణి సుప్రియ ఇంట్లో చాలా కాలంగా నమ్మకంగా పనిచేస్తుంది. తనను పనిమనిషి లా ఎప్పుడూ చూడలేదు.

తనపిల్లలతోపాటే శార్వాణి పిల్లలను కూడా సుప్రియ చూసేది.

ఇంట్లో ఎంత విలువైన వస్తువులున్నా ఎప్పుడూ ఆశపడలేదు.ఇంట్లో తను ఏదైనా కొత్త చీరతెచ్చుకుంటే శార్వాణి కి కూడా తెచ్చేది. అందుకే సుప్రియకు శార్వాణి అంటే చాలా నమ్మకం. ఇంట్లో బీరువా తాళాలు కూడా వేయకుండా తనపైనే ఇంటిని వదిలిపెట్టి వెళ్ళేది కూడా.

ఇప్పుడు తన ఆడపడుచు చేసిన పనివల్ల ఇంతకాలంగా సంపాదించుకున్న నమ్మకం కాస్తా పోతుంది ఇప్పుడు తను

అమ్మగారికి ముఖం ఎలాచూపాలి ..? ఆ ప్యాకెట్ సుప్రియ ఇంటిలోనుండి తీసుకొచ్చింది అని రూఢీ చేసుకుని ఒకనిర్ణయానికి వచ్చింది.

లోలోపలే తనే తప్పు చేసినట్లు సిగ్గుపడింది చాలా కుమిలి పోయింది.

ఏదేమైనా కానీ అని తరువాత రోజు పనిలోకివెళ్ళి ఆవిషయం అమ్మగారికి చెప్పాలనుకుంది.

××××

అంతకుముందు రోజు సుప్రియ కొన్న కొత్తచీరలన్నీ టేబుల్ పైనే ఉండడం శార్వాణి గమనించింది. హమ్మయ్య సంజాయిషీ ఇచ్చుకుని తన మరదలి గురించి చెడుగా చెప్పే కంటే... అమ్మగారికి తెలియకుండా ఈ చీరల్లో పెట్టేస్తే సరిఅనుకుంది.

తనుతీసుకెళ్ళిన చీర ఎవరూ చూడకుండా అందులో పెట్టేసింది.

పని అయిపోయింది అమ్మగారు వెళ్ళిపోతున్న అన్నది శార్వాణి.

సుప్రియ పిలిచి ఇప్పుడు ఒంట్లో ఎలా ఉంది శార్వాణి అని అడిగింది.

రేపు కాస్తా పెందలాడే వచ్చేయి చాలా పనులున్నాయి అలాగే?.

రేపు పండుగ కదా మా పిల్లలతో పాటు మీకూ బట్టలు తెచ్చాం ఇదిగో తీసుకో అంటూ ప్యాకెట్ తెచ్చి శార్వాణి చేతిలో పెట్టింది.

అందరూ కొత్తబట్టలు వేసుకొని ఇక్కడికే రండి అందరం పండుగ ఇక్కడే చేసుకుందాం.ముందే నీకు ఆరోగ్యం సరిగా లేదు అంది.

సరే అమ్మగారు?. అనుకుంటూ వెళ్ళిపోయింది.

××××××

ఇంటికెళ్ళాక ప్యాకెట్ విప్పి అందరికీ బట్టలు ఇచ్చింది.

చూస్తే తాను తీసుకెళ్లి ఇంట్లో పెట్టిన చీర అందులో ఉంది.

ఈవిషయం అమ్మగారికి తెలియదు. అది నాకోసం తెచ్చిన చీరనే కదా?!!

మనసులోనే యజమానురాలికి కృతజ్ఞతలు చెప్పుకుంది.

శార్వాణి ఎలాంటిదో సుప్రియ కు తెలుసు.

విషయం తనకు తెలుసు అని తెలిస్తే బాధపడు తుంది.

పనిలోకి రావడం మానేస్తుంది. తన మనసును కష్టపెట్టడం సుప్రియ కు ఇష్టం లేదు అందుకే తను తెచ్చుకున్న చీరను శార్వాణి కి ఇచ్చి ఏం జరుగనట్లు ఉండిపోయింది .

నిజం ఏంటో ఇప్పుడు తెలియవలసిన అవసరం లేదు.

నమ్మకం ఉన్నదగ్గర అపార్థాలకు చోటుండదు కదా?.!!

నీతి: నిజాయితీ కలిగిన వారికి ఆత్మీయులు ఎక్కువ.



-జయంతి వాసరచెట్ల
9985525355

# ఎర్రని గొంతుక

చేతనలేని మట్టికి
ఆయువునిచ్చే చేతులు
మట్టిని పరవసింపజేసే సుతి మెత్తని గజ్జల నడకలు
కరువు కాటుకు కాయలా పడినా
ప్రాణం పెట్టి పంటకు ఊపిరిలూదిన మనసులు
తను కష్టం చేస్తూ పంటకు
నాట్యం నేర్పిన గొంతుకలు
కన్న బిడ్డగు పంటకు కష్టం వస్తే
ఉరుకుల పరుగుల పాదాలు
ఇప్పుడు
కార్పోరేట్ కబంధ హస్తాల లోకి దూర్చబడుతున్నాయి
బతిమాలినా బలవంతంగా
ఇరికించబడుతున్నాయి
ఇక
మాటలు నేర్చిన కార్పోరేట్ పిట్టకు
బంధనం వేయవలసిందే
ఆరుగాలం కష్టించే అన్నధాత
ప్రతి నాగలి ఎర్రని గొంతుకై తిరగబడవలసిందే
ముద్ద పెట్టే చేతులకు రాజకీయ రంగులద్దినప్పుడు
అన్నం పెట్టే రైతన్నను దేశద్రోహుల జాబితాలో చేర్చినప్పుడు
ప్రతి కలం ఎర్రని సిరా నద్దుకొని ప్రతిఘటించవలసిందే
ప్రతి మనసూ విలవిల లాడి ఉద్యమించవలసిందే



-ఆవుల చక్రపాణి యాదవ్
9963350973

# కర్ణా 'కరుడు' (కథ)

ధరణికి పెళ్లై నాలుగేళ్లైనా, జోల పాటలు లేక ఇల్లంతా బోసిపోయింది. ఆలస్యమైనాకొద్దీ ఆమెకు పిల్లలపై ఆపేక్ష విత్తనం పెరిగి వృక్షమైంది. దాంతో ఇరుగు పొరుగు పిల్లలను చేరదీసి లాలించేది. పిల్లల కోసం కనబడ్డ చెట్టుకు అభిషేకం, పుట్టలో పాలు పోయడం, రాయికి, రప్పకి బొట్టు పెట్టి పూజ చేయటం నిత్యకృత్యమైంది.

ఏ పూజ ఫలించిందో కానీ, ఏడాది తిరిగే సరికి ఇంట్లో లాలిపాటలు వీణా వాయించినట్టు వినబడ్డాయి. బాబు పుట్టిన ఆనందంలో తనుంటే, నెల్లాల్లకే విధి, వీధి నాటకమాడి భర్తను బలితీసుకుంది. బాబు ధన్వంతరి బోసినవ్వులతో అమ్మను ఓదారుస్తుంటే, ధరణి తొందర్లోనే కోలుకుంది. అంతలోనే "ఎడారిలో దొరికిన గుక్కెడు నీళ్లు నీరెండకు ఆవిరైనట్టు!" ధన్వంతరికి చెవులు మందగించినై! "కొండ మీది నుంచి బండ రాయి దొర్లినట్టు" జీవితాన్ని ఎలాగోలా నెట్టుకొస్తుంది ధరణి.

ధన్వంతరికి ఆరేళ్లు నిండడంతో, బడికి పంపాలని దగ్గర్లోని బడికి తీసుకెళ్తే చెవిటి వాడని ఎవరూ చేర్చుకోవట్లేదు. మంచి మనసున్న మాధవి టీచర్ బడికెళ్ళి ప్రాధేయపడ్డా, ఇతర పిల్లలకు ఇబ్బందవుతుందని సున్నితంగా తిరస్కరించింది! చేసేది లేక బడి బయట కూర్చొని ఏడుస్తుంటే, అనాధలకు, అవిటి వారి కొరకు పాఠశాలను నడిపిస్తున్న కరుణ టీచర్ కరుణించి ధన్వంతరిని తన పాఠశాలలో చేర్చుకొని, ఒక ఆయుర్వేద వైద్యునికి చూపించగా ఏడాదికల్లా సప్తస్వరాలను వినగలిగాడు ధన్వంతరి!

బాగా చదివి డాక్టరై, పేదవాళ్ల డాక్టరని పేరు తెచ్చుకున్నాడు ధన్వంతరి. ఒకరోజు మాధవి టీచర్ కి చెవిలో నొప్పిగా ఉండడంతో, పేరు పొందిన ధన్వంతరి దగ్గరికి వెళ్లగా, ఆమెను గుర్తు పట్టి నమస్కరించి గతం గుర్తు చేశాడు ధన్వంతరి.

"క్షమించమండి!" మాధవి టీచర్.

"మీకు చాలా ధన్యవాదాలు మేడం!" అన్నాడు వినయంగా

"ఎందుకు బాబు?" అంది మాధవి టీచర్ విస్మయంగా!

"అప్పుడు మీరు నన్ను తిరస్కరించక పోతే నాకు కరుణా టీచర్ దొరికేది కాదుగా!" అన్నాడు మృధువుగా.

–అతని మంచితనాన్ని మనసులోనే శ్లాఘించి, తనూ కరుణా టీచర్ లా కావాలనుకుంది.! మాధవి టీచర్.



-గంగశ్రీ
9676305949

# తెలియదు!

కలలు కనే...కన్నెపిల్లలకు
తెలియదు పాపం...
తీరందాటి తుఫానేనని...
కాలుజారితే కన్నీరేనని...

కడలిలో ఎగిసిపడే...అలలకు
తెలియదు పాపం..
తీరందాకే తమ పయనమని...
తిరిగి రాక తప్పదని...

చెరువులో తిరిగే...చేపలకు
తెలియదు పాపం...
గట్టెక్కితే తమకు గండమేనని...
ఒడ్డుచేరితే బ్రతుకు ఒక్కక్షణమేనని...

రెక్కలుముక్కలు చేసి
మొక్కలు పెంచే...వనమాలికి
తెలియదు పాపం...
పూచిన పూలన్నీ పూజకేనని...
పండిన ఫలాలన్నీ పరులకేనని...

ఆకలిగొన్న
అమాయకపు...మేకకు
తెలియదు పాపం...
తిట్టి కొట్టి తనకు తిండి పెట్టేది...
తిరిగి రేపు తనను తినడానికేనని...

ఒంగిఒంగి...నాయకుడు
దండాలు పెడుతుంటే
పొంగిపొంగిపోయే...ఓటరుకు
తెలియదు పాపం..
రేపు వాడు కుర్చీలో కూర్చోగానే
కుబేరుడౌతాడని...
తాను మాత్రం ఆకలికి
అలమటించే అస్థిపంజరమేనని...

రాత్రింబవళ్ళు
గొడ్డుచాకిరీ చేసే...ఉద్యోగికి
తెలియదు పాపం...



-పోలయ్య కవి కూకట్లపల్లి
9110784502

పుస్తక సమీక్ష

# "కవిత్వారవిందాలతో ఎగిరిన నానీవిహంగాలు"

**"నానీలబ్రహ్మ**
**ఆచార్యగోపి**
**వాక్యాలు నాలుగు**
**చతుర్ముఖాలుగా"**

డా.ఎన్ గోపి గారి చేతిలో 1997 లో పురుడోసుకున్న లఘుకవితారూపం "నానీలు" సారవంతంగా, వస్తువైవిధ్యంతో, నిర్మాణబలంతో,నిర్మాణవైవిధ్యంతో మొదలయ్యాయి కానీ హైకూల్లా ఆగిపోలేదు. జీవనదిలా నానీలు ప్రవహిస్తూనే వున్నాయి పాఠకసీమల్లో. దరిదాపు మూడు వందలకు పైబడిన నానీలు సంపుటాలు వచ్చాయి. రెండుదశాబ్దాలకు పైగా కాలాన్ని నానీలు అలంకరించాయి,అలరించాయి. కవితాశక్తితో, చమత్కారంతో,వ్యంగ్యంతో కూడిన చరుపుతో మెరుపుతో నానీలు విజయవంతంగా రాణిస్తున్నాయి. అయితే నానీసంపుటాల్లో వచ్చిన నానీలన్నీ గట్టిగింజలే అని అనను.కొన్ని తాలుగింజలూ వున్నాయి. అయితే కవిత్వం చెప్పుకోగల ఆస్కారమైతే నానీల్లో వుందనీ గట్టిగా చెప్పగలను. ఈ అభిప్రాయం, ఇటీవల దేవినేని అరవిందరాయుడు రాసిన నానీవిహంగాలు సంపుటి నిలబడుతుందని అతని చిట్టిపద్యాలు చదివాక మరింత బలపడింది. గతంలో అనేక నానీసంపుటాలు వెలువడ్డాయి. వాటిలో నానీవిహంగాలు ప్రత్యేకంగా నిలబడతాయి. ఇందులో విషయవిస్తృతి విశేషంగా ఆకర్షించింది. ఆ విస్తృతిని ఇపుడు పరిశీలిద్దాం!

అరవిందరాయుడు కవిత్వం చేసే నేర్పు గలవాడు. సరియైన అక్షరాల కూర్పు అతడి శైలీరమ్యత.

"మేఘం రాసింది/వానకవిత/సముద్రం సంపుటిలోంచీ/అనువాదం చేస్తూ"

చెబుతున్న విషయం వాన.సముద్రంలో నీటిఆవిరి పైకెళ్లి మేఘాలుగా మారతాయన్నది మనకు తెలుసు. దానిని అందంగా కవిత్వపరిభాషను వాడి నానీగా అందించాడు. వానకవితను మేఘం (కవిలా) రాయడం ఇందులోని విశేషం!

ఈ నానీ కవిలో ప్రకృతిమమేకత ఎక్కువ. చాలా నిశితంగా ,ఇష్టంగా నానీల్లోకి ప్రకృతిపోలికల్ని ఒదిగించాడు. కొన్నింటిని తడమండి.

1."చెట్టునూ నేలనూ/కలుపుతూ/నీడను నేసే సాలీడు పేరు/సూరీడు"
2."మిణుగురు/అన్వేషణ/రాత్రిగుండెలో/దాగిన సూర్యునికోసం"
3."అమావాస్య/బెట్టు సడలింది/హాయిగా నవ్వింది/నెలపొడుపు"
4."తేనెపట్టు/పెట్టింది/కొమ్మమీద కాదు/కోకిలమ్మ గొంతులో"

పై నానీలను గమనిస్తే ప్రకృతిని మనోహరమైన భావచిత్రాలుగా గీసాడు కవి. సౌందర్యమలంకారం అని ఆర్యోక్తి. కవికున్న ఈస్తటిక్ దృష్టి ఇలాంటి నానీల్లో బహుగా గుబాళిస్తుందనే ఎరుక అరవిందరాయుడిలో కనిపిస్తున్నది.

ఏ ప్రక్రియలో కవిత్వాన్ని చెప్పినా సమకాలీన ప్రాసంగిత వుండి తీరాల్సిందే! వర్తమాన అవసరతలపై కవికన్ను పడాల్సిందే! అలాంటి కవిపెన్నుకే ప్రజల వైపునుంచి మన్నన. నానీ విహంగాల్లో వర్తమానం శక్తివంతంగా,అధిక్షేపంగా పలకబడింది. చదవండి కొన్ని..

"ఆ ఇంట్లో/టివి చెడిపోయింది/చాన్నాళ్లకు/ఒక్కటైంది కుటుంబం"

ఆధునిక సాంకేతికాభివృద్ధి వల్ల సౌలభ్యం వున్నట్టే, విషాదమూ వుంది.టెలివిజన్ వచ్చాక,సెలఫోన్ లు వచ్చాక మనుషుల్లో యాంత్రికత పెరిగింది.సమూహాలు అపహాస్యం అవుతున్నాయి.ఒకే కుటుంబంలో ఏకాకితనాలు రాజ్యం ఏలుతున్నాయి. దీనిని టివి చెడిపోవడం అంట్లే యాంత్రికతలోని విషాదం భగ్నమడాన్ని సూచించాడు. ఇంకొక నానీలో..

"మనిషి/భ్రమణపరిభ్రమణాలు/స్వార్థంచుట్టూ/డబ్బుచుట్టూ"

"మనిషో/మాయల మరాఠీ/పంచప్రాణాలూ/డబ్బుచిలుకలోనే" అంటాడు.ఇక్కడ ఆధునిక మానవుడి స్వార్థపరత్వాన్ని,డబ్బుమీద అపేక్షనీ నిరసించాడు. సామాజిక స్పృహ లేకపోవడాన్ని నిబిడీకృతంగా అన్వయించాడు. కవిత్వానికి గుప్తత కీలకం. చాలానానీల్లో నేటికి అత్యవసరమైన అంతరికసందేశాలెన్నో దాగివున్నాయి.





చిన్న జాగాలో ఏం చెప్పడానికుంటుందనీ, నానీలపై పెదవి విరిచినవాళ్లు వున్నారు. అలాగంటే ప్రాచీన "గాథ"ల్లో కవిత్వం మిసమిసలాడలేదా!? హైకూలలో నవనవలాడలేదా!? వాటిని గమనించే "వాక్యమ్ రసాత్మకమ్ కావ్యమ్ " అనే అలంకారిక ప్రతిపాదన వెల్లడయ్యింది గదా! నానీలు బుడ్డిపద్యాలే అయినా లోతులెన్నో చిత్రించబడుతున్నాను. ఈ సంపుటిలో పుంఖానుపుంఖాలుగా నానీలు పసతో,మిసిమితో రాయబడ్డాయి. మరికొన్ని రుచిచూడండి.

1."తడుస్తూనే/ఉంటాయి/వానొస్తే పొలమూ/రాకపోతే రైతుకళ్లు"(అతివృష్టి,అనావృష్టి సూచన)
2."టెంకాయ/బాగా పగిలింది/అహమే/చెక్కుచెదరలేదు"(ఆధ్యాత్మికతలో డొల్లతనం)
3."అమె/కఠోరతపస్సులో మునిగింది/అమ్మ/కాబోతుంది కదూ"(అమ్మ గొప్పతనం)
4."కాకులు/ముట్టుకోలేదట/ఎంగిలిచేయీ/విదల్చనోడి పిండం"(పిసినారిపై సెటైర్)

ఈ పుస్తకంలో నానీలను చదివాక, కవి లోకరీతుల్ని ప్రతిభావంతంగా రాసాడు. మనుషుల అస్తవ్యస్థ నడవడులపై చురకలెన్నో పెట్టాడు. సూటిగా,స్పష్టంగా విషయాన్ని మలిచాడు. తాత్వికత,సామాజిక,మానవతల హారంగా నానీవిహంగాలు జిగితో,బిగితో ఆవిష్కరించబడ్డాయి.

ఇంకో విశేషాన్ని చెప్పాలంటే ఈ నానీ కవి నేటి మభ్యపెట్టే రాజకీయంపై తలపెట్టాడు.తలపడ్డాడు.

1."స్వచ్ఛాభారత్ కదూ/అంతా వూడ్చారు/పెద్ద కుర్చీలపై/చెత్తతప్ప"
2."రాజకీయం త్రాచునోరూ/ఒక్కతీరే/విషమూ/రెండునాలుకలా"
3."పరిపాలనంతా/లాభనష్టాల చుట్టే/ఈస్టిండియా/వారసత్వం మరి"

కవిత్వం యథార్థతల మీద కుండబద్దలు కొట్టాలి. భ్రమలతెరలను చించిపారేయాలి. పాలకుల గారడీలను కవులు కనిపెట్టి రాయాలి. నానీవిహంగాలు అరాజకీయాన్ని వాడియైన శైలితో పొడిచి పారేసాయి. కవి నిర్భీతికి, నిజాయితీకి పై నానీలు తార్కాణాలు.

"వర్ణనా నిపుణః కవిః". వర్ణనానిపుణత లేకపోతే కవిత్వం పేలవంగా వుంటుంది. చిట్టి చిట్టి పద్యాలైనా వర్ణనాశక్తి ప్రధానం. ఈ కవిలో ఊహాశక్తి అమోఘం. దానిని రుజువుజేసే పాదాల్లోకి కనులు సారిద్దాం.

1."రాజీనామా చేసిన/మంత్రిలా/పడమటికొండల్లో/సూర్యుడు"
2."సాయింత్రం /అయ్యిందంటే చాలు/ కొమ్మకొమ్మలో/ కువకువల ముషాయిరా"
3."నీడశిరసున/చెట్టు/ఆకుపచ్చకిరీటమై/నవ్వుతోంది చల్లగా"

రాసుకుంటూ పోతే విశ్లేషణ పొడవైన నదిలా పరుగులు తీస్తుంది. ఈ నానీలు నానీలరూపం మీద భరోసాని మళ్లీ పెంచాయి. కవిత్వం చెప్పగలిగే పనితనం వుండాలే గానీ నానీల నిర్మాణవైవిధ్యం ఎంతో అనువైనదనీ అరవింద రాయుడి నానీవిహంగాలు నిరూపించాయి.

నాలుగుపంక్తుల్లో, ఇరవై ఐదు అక్షరాల్లో నలుదిక్కుల మధ్య వున్న ప్రపంచాన్ని విషయనూ త్నతతో "కవిత్వారవిందం"గా అందించినందుకు కవికి మనసారా అభినందనలు.

ప్రతులకు: **శ్రీమతి దేవిని సవిత**
సెల్: 9059483804



-మెట్టా నాగేశ్వరరావు
సెల్: 9951085760

